క్లుప్తంగా

గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజును పురస్కరించుకుని శనివారం భక్తులు కదిరి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. కదిరి కొండకు హారతి ఇచ్చిన అనంతరం భక్తులు గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మ హాజరయ్యారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు కుమ్మరవాండ్లపల్లి గ్రామస్తులు, ఖాద్రీ నృసింహ స్వామి సమితి సభ్యులు పానకం, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. కదిరికి చెందిన కోటి రెడ్డి భక్తులకు అల్పాహారం అందజేశారు.

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

తనకల్లు: ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కంటే అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ సనావుల్లా హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఫర్టిలైజర్ షాప్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. దుకాణాల ముందు స్టాకు వివరాలతో పాటు ధరల బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎరువులు, మందులను కొనుగోలు చేసిన తరువాత రైతులకు రసీదులు అందజేయాలని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ భారతి, ఏఈఓ ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు

ధర్మవరం అర్బన్: విద్యార్థులు ప్రపంచ విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు సూచించారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రాజనీతి శాస్త్రం, ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎలాంటి విద్యకైనా అవకాశాలున్నాయని వాటిని మనం తెలుసుకుని తగిన విజయం వైపు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, అధ్యాపకులు గోపాల్‌నాయక్, త్రివేణి, పావని, హైమావతి, ఆనంద్, మీనా, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం అర్బన్: ఆర్టీసీలో డ్రైవర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్సు కలిగి కనీసం 18 నెలల అనుభవం, ఆర్టీఓ కార్యాలయంలో క్లియరెన్స్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి 25 నుంచి 45 ఏళ్లలోపు వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 10 నుంచి డీఎం కార్యాలయంలో అందించాలని సూచించారు.

ఘనంగా గురువందన అవార్డుల వేడుక



విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ జయరాంశెట్టి, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: గోరంట్ల సమీపంలో ఉన్న బెస్ట్ ఇన్నొవేషన్ యూనివర్సిటీలో గురువందన అవార్డుల ప్రదానోత్సవం–2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యావేత్త, రచయిత డాక్టర్ జయరాంశెట్టి కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ జైప్రకాశ్, ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ నితిన్ సోమాన్ని, కాసర్ డీన్ రాంగోల్ బోధన రంగంలో విజయాలు సాధించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడంతో పాటు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. డాక్టర్ జయరాంశెట్టి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు.

విత్తని(న) ఏకాదశి!

- పల్లెల్లో కానరాని పండుగ శోభ
- వర్షాభావంతో విత్తనం వేసేందుకు దాటుతున్న అదను
- ఆందోళనలో రైతులు

ధర్మవరం: విత్తన ఏకాదశి నాటికి పచ్చనిపైర్లతో కళకళలాడుతూ ఉండాల్సిన పంటచేలు..వరుణుడు ముఖం చాటేయడంతో బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. తొలకరి చినుకులకు అక్కడక్కడా విత్తుపడిన చేన్లు వర్షం రాక కోసం ఆకాశంవైపు చూస్తున్నాయి. దీంతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాల్సిన ఏకాదశిపై రైతులు నిరాసక్తి చూపుతున్నారు. ఏకాదశి పండుగను వెంట బెట్టుకుని వస్తే ఉగాది పండుగ ఊడ్చుకుని పోతుందని గ్రామీణ ప్రాంతాల్లో నానుడి. అయితే ఈ ఏడాది ఏకాదశి పండుగను చాలా గ్రామాల్లో నిర్వహించడం లేదు. ఈ పాటికి చేలో మొక్కలై ఉండాల్సిన విత్తనాలు రైతు నట్టింట్లోను ఉండిపోయే పరిస్థితి ఉంటే పండుగను ఎలా జరుపుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధర్మవరం మండలంలో పొలంలో సేద్యం చేసి విత్తనం వేయకుండా బీడుగా వదిలేసిన దృశ్యం

ముఖం చాటేసిన వరుణుడు

సాధారణంగా జూన్ నెలలో వర్షాలు మొదలవుతాయి. అయితే ఈ సారి మే నెలలోనే పలుచోట్ల వర్షాలు కురిసాయి. ఆ తర్వాత అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు కురిసాయి. దీంతో చాలా చోట్ల అరకొర పదునుతో దుక్కిదున్ని సేద్యం చేసి విత్తు వేశారు. తర్వాత వర్షం రాక పోవడంతో రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. మరోవైపు తీవ్రవర్షాభావం కారణంగా ధర్మవరం నియోజవర్గంలోని వేరుశనగ సాగు గణనీయంగా తగ్గింది. ధర్మవరం మండలంలో 18 వేల హెక్టార్ల విస్తీర్ణం ఉండగా కేవలం 20 శాతం మాత్రమే పంట సాగు చేశారు. బత్తలపల్లి మండలంలో 13,500 హెక్టార్లకు 15 శాతం, ముదిగుబ్బ మండలంలో 23 వేల హెక్టార్లకుగాను 40శాతం, తాడిమర్రి మండలంలో 18,500 హెక్టార్లకుగాను 20 శాతం దాకా మాత్రమే రైతులు సాగు చేశారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



నాకున్న 4 ఎకరాల్లో వేరుశనగ పంట వేసేందుకు విత్తనాలు సిద్ధం చేశాను. అయితే సకాలంలో వర్షం రాక పోవడంతో విత్తనాలను విక్రయించి కంది వేసేందుకు సిద్ధమయ్యా. సేద్యం చేసేందుకు, విత్తనాలు అమ్మడంతో నష్టపోయాం. పంట వేసి నష్టపోయే కంటే ముందే అమ్ముకుంటే మేలన్న అభిప్రాయంతో పంటను మార్చాం. ఈ ఏడాది ఏకాదశి పండుగ చేయడానికి మనస్సు ఒప్పడం లేదు.

–నారాయణ, రైతు, చిగిచెర్ల గ్రామం, ధర్మవరం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



తీవ్ర వర్షాభావం కారణంగా జిల్లాలో రైతులు విత్తన వేరుశనగ పంట వేసి నష్టపోతున్నారు. ప్రభుత్వ సాయం కూడా అందడం లేదు.దీంతో అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ పథకం మొత్తాన్ని ఒకేసారి అందించి ఆదుకోవాలి. లేకపోతే రైతాంగ మనుగడ కష్టమవుతుంది.

–జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రెండో రోజూ ఎంప్లాయీస్ యూనియన్ ధర్నా





డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు , ధర్మవరంలో నిరసన తెలుపుతున్న ఈయూ నాయకులు

కదిరి అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిపో గ్యారేజీ ముందు శనివారం రెండోరోజూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పదోన్నతులు ఇవ్వడం లేదన్నారు. పాత వైద్య విధానం కొనసాగించాలన్నారు. సీపీఎస్ కార్యాలయం తరలింపును ఆపాలన్నారు. మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగుల పిల్లలకు కారుణ్యనియామకాలను చేపట్టాలన్నారు. ఈయూ రీజనల్ అధ్యక్షులు జీవీపీరావ్, దివాకర్, ఆర్‌ఎస్‌రెడ్డి, శంకరప్ప, ఎంకే రెడ్డి, అక్బర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, రీజనల్ జాయింట్ కార్యదర్శి బి.నరసింహులు, డిపో అధ్యక్షుడు తిరుమలేసు, డిపో కార్యదర్శి ముస్తఫ పేర్కొన్నారు. ధర్మవరం ఆర్టీసీ డిపోలో శనివారం గేట్‌మీటింగ్ నిర్వహించి రెండోరోజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వద్దనున్న పదోన్నతుల ఫైల్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. ఎస్‌ఆర్‌బీటీ, ఎస్‌బీటీ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఎస్‌ఆర్‌బీఎస్‌కు 18 శాతం వడ్డీతో బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డబుల్ డ్యూటీ చేస్తున్న ఉద్యోగులకు డీడీ అమోంట్ పెంచాలన్నారు. ఏడీసీ టీఎస్ మూర్తి, సిస్టమ్ సూపర్‌వైజర్ బల్లా సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రెండో రోజు స్థానిక డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ డీఏ బకాయిలు, 11వ పీఆర్‌సీ అరియర్స్ 24 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. యూనియన్ రీజనల్ కార్యదర్శి శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ ఖలీల్‌బాషా, డిపో సెక్రటరీ సాదిక్‌పీరా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు లక్ష్మీనృసింహుడు

- తొలి ఏకాదశి సందర్భంగా నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఓబుళ లక్ష్మీనరసింహస్వామి భక్తుల కోర్కెలు నెరవేరుస్తూ కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. ఏటా ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పర్వదినం రోజున ఇక్కడ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారు. ఇదే రోజు స్వామి ఉత్సవ ప్రతిమలతో (గిరిగిలు) పట్టణం నుంచి న్యామద్దెల గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న కొండకు ఊరేగింపుగా వెళతారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ ప్రతిమలను తీసుకొచ్చి వెంకటంపల్లి రోడ్డులో ఉన్న వంకలో శుద్ధి చేస్తారు. వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాటిని ప్రత్యేకంగా తయారు చేసిన పూల పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగిస్తారు. పల్లకీ ముందు వెలుగుతున్న దివిటీలను చేత పట్టుకుని ఆలయ పూజారి నృత్యం చేసే దృశ్యాన్ని చూసేందుకు భక్తులు ఎగబడతారు. సోమవారం ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం (దాసంగాలు) చేస్తారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

ధర్మవరం అర్బన్: ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామని ఏపీ చేతివృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు కోరారు. ఈమేరకు పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ మూడోసారి అధికారంలోకి రాగానే కార్పొరేట్ ఏజెండాను నిర్దాక్షిణ్యంగా అమలు చేస్తున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను రద్దు చేస్తున్నారన్నారు. సమ్మెలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పూల శెట్టి రవికుమార్, పట్టణ సహాయ కార్యదర్శి రమణ, శ్రీనివాసులు, వెంకటనారాయణ, వెంకటస్వామి, చెన్నంపల్లి శ్రీనివాసులు, కిరణ్, దస్తగిరి, గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, తాజ్, ఆంజనేయులు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఓడీచెరువు: వ్యవసాయ బావులకు స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యలయం ముందు నిరసన తెలియజేశారు. సీపీఐ మండల కార్యదర్శి చలపతి మాట్లాడుతూ ఎన్నికల్లో స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి ప్రస్తుతం వాటిని ఏర్పాటు చేయడానికి యత్నించడం దారుణమన్నారు. అనంతరం ఆర్‌ఐ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీనియర్ నాయకులు పూల శ్రీనివాసులు, రవికుమార్, దేవేంద్ర, రత్నభాయి, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఓడీచెరువులో ఆర్ఐకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

తనకల్లు: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కోటూరులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలు పెంచిందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలను పెంచడం సమంజసం కాదన్నారు. అనంతరం ఏఈ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు చౌడప్ప, రవి, రవీంద్రనాయక్, రెడ్డెప్ప, మురళీ, నిరంజన్, నరసింహులు, గంగాధర్, రమణమ్మ, రామయ్య, నారాయణమ్మ, మూర్తి పాల్గొన్నారు.

నల్లమాడ: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిలో నాలుగుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని ధ్వజమెత్తారు. డిప్యూటీ తహసీల్దార్ మనోజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ సహాయ కార్యదర్శి గంగాధర్, నాయకులు బాలాజీనాయక్, రాజు, రమణ, కేశప్ప, రాములు, బాబు, చంద్ర పాల్గొన్నారు.

ముదిగుబ్బ: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు ఇవ్వాలని చూసిన అధికారులు అందుబాటులో లేక పోవడంతో వినతిపత్రాన్ని కార్యాలయం వద్ద గోడకు అతికించారు. నాయకులు శ్రీనివాసుల నాయుడు, తుమ్మల చిన్నప్ప, ముత్తులూరి మధు, కొండయ్య, గణేష్‌యాదవ్, సోమల నరసింహ పాల్గొన్నారు.

క్షయను నిర్లక్ష్యం చేయొద్దు

పుట్టపర్తి టౌన్: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని టీబీ సూపర్‌వైజర్ అబీబ్‌బాషా పేర్కొన్నారు. శనివారం లోచర్ల గ్రామంలో సిబ్బందితో కలసి క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన క్షయ లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమీలబాయ్, లక్ష్మీదేవి, గంగరత్న, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి ఓబులేశ్వరస్వామి ఉత్సవాలు

పుట్టపర్తి అర్బన్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జగరాజుపల్లి సమీపంలోని కొండపై వెలసిన ఓబులేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొండపై ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే కొండపైకి రహదారి, తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కంటి వైద్యశిబిరం

హిందూపురం: స్థానిక రోటరీభవన్‌లో శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సుబ్బారావు, ఆదినారాయణ 50 మందికి కంటి పరీక్షలు చేసి అందులో 20 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. అనంతరం ఆపరేషన్లకు ఎంపికైన వారిని ప్రత్యేక వాహనంలో కడపకు పంపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు కళ్యాణ్, కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, సభ్యులు అరుణ్ కుమార్, శివయ్య, ఓబులకొండయ్య, నాగన్న, పవిత్ర, గిరిధర్ పాల్గొన్నారు.

విద్యార్థి మృతదేహం స్వగ్రామానికి తరలింపు

ధర్మవరం రూరల్: ఓబుళనాయనపల్లికి చెందిన గడ్డం చంద్రశేఖర్, గోవిందమ్మ దంపతుల కుమారుడు అభిరామ్(19) రెండు రోజుల క్రితం విజయవాడ కృష్ణానదిలో గల్లంతైన విషయం తెలిసిందే. అభిరామ్ మృతదేహాన్ని శనివారం ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చారు.

పోలీసుల నాకాబందీ

తాడిమర్రి: చిల్లకొండయ్యపల్లిలో శనివారం పోలీసులు నాకాబందీ చేపట్టారు. ఎస్ఐ కృష్ణవేణి సిబ్బందితో కలిసి అనుమానితుల ఇళ్లు, పాడుబడిన ఇళ్లు, గడ్డివాముల్లో సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సూర్యనారాయణ రాజు, హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కేశవనగర్‌లో ఫాగింగ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లో నరసింహులు అనే వ్యక్తికి డెంగీ పాజిటివ్ రావడంతో శనివారం మెడికల్ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, వార్డు ఇన్‌చార్జ్ ధనుంజయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, మేస్త్రీ పార్థసారథి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్త మల్లేశ్వరి వార్డుల్లోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురుగుకాలువల వద్ద మలాథియాన్ పౌడర్‌ను చల్లించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ధర్మవరం అర్బన్: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని చెన్నకేశవపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు షాజియా తెలిపారు. స్థానిక ఇందిరమ్మకాలనీలోనున్న మున్సిపల్ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్, బాయ్స్ హాస్టల్‌లో శనివారం వైద్యురాలు షాజియా విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ తదితర రక్తపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. దీర్ఘకాలిక జబ్బులు ఉన్న విద్యార్థులను జిల్లా ఆసుపత్రులకు సిఫారసు చేశారు. ఎంపీహెచ్ఏ శ్రీనివాసులు, ఏఎన్ఎం గాయత్రి, సీఓ సునిత, ఆశా కార్యకర్తలు సాయి లీల, అరుణ, లలిత, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శ్యానిటేషన్ అధికారి శివయ్య వ్యాపారులను హెచ్చరించారు. శనివారం పట్టణంలో పలు దుకాణాలు, హోటళ్లు, వారపు సంతలో దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారికి జరిమానా విధించారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సోమశేఖర్



గరుడంపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రజలు గొడవలు లేకుండా మొహర్రం వేడుకలు జరుపుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. శనివారం గంటాపురం, పోట్లమర్రి, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అనంతసాగరం గ్రామాలతో పాటు పలు గ్రామాలలో పర్యటించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేడుకల్లో ఏ చిన్న గొడవ జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని, గొడవలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలకు, డ్రమ్స్ వంటి వాటికి అనుమతులు లేవన్నారు. ఆదివారం రాత్రి జరిగే పెద్ద సరిగెత్తు కార్యక్రమాలను, సోమవారం జరిగే భేటీ, మంగళవారం జరిగే జలధి కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధర్మవరం రూరల్: మొహర్రంను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం తన సిబ్బందితో కలిసి గరుడంపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మొహర్రం నిర్వహణపై గ్రామస్తులకు సూచనలు చేశారు. జూదం, మద్యం వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

వజ్ర భాస్కర్‌రెడ్డికి ఘన సన్మానం



వజ్ర భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా, నాయకులు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి(ఆర్గనైజేషన్ యాక్టివిటీ)గా నియమితులైన వజ్ర భాస్కర్‌రెడ్డిని శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వజ్రభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఐకమత్యంతో పని చేసి జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి(ఆర్గనైజేషన్ యాక్టివిటీ)గా నియమితులైన వజ్ర భాస్కర్‌రెడ్డికి నల్లచెరువు మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సద్దపల్లి రఫీ, సోమిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, సర్పంచ్ యూసుఫ్, టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, హైటెక్ రమణ, మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 265 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

ధర్మవరం అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో 265 కేసులు పరిష్కరించామని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ జడ్జి నందిని, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి మురళి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు తుది తీర్పు అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో మొత్తం 265 కేసులు పరిష్కరించగా ఇందులో సివిల్ కేసులు 2, క్రిమినల్ 92, ఎక్సైజ్ 29, ఎన్ఐ యాక్ట్ 12, పీఎల్‌సి 9, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్‌లోని కేసులు 121 ఉన్నాయి. బ్యాంకులు, జరిమానాలు, ఎక్సైజ్, ఎన్ఐ యాక్టు కేసుల్లో రూ.7,83,440 మొత్తం కోర్టుకు వచ్చినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కరీమ్, ప్రధాన కార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి, కోశాధికారి అబ్దుల్లా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

పుట్టపర్తి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈసందర్భంగా రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, జిల్లా పరిశీలకులు రమేష్‌రెడ్డి హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

నేడు పుట్టపర్తికి తరలిరండి

నల్లమాడ: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి నల్లమాడ మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా లింగాల లోకేశ్వర్‌రెడ్డి



కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు న్యాయవాది లింగాల లోకేశ్వర్‌రెడ్డిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా ఆయన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా లక్ష్మన్న



కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అంకె లక్ష్మన్నను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు, సూచనల మేరకు పని చేస్తూ గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. నియామకానికి సహకరించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు నెమలి అప్పగింత



ఫారెస్ట్ అధికారులకు నెమలిని అప్పగిస్తున్న టూ టౌన్ పోలీసులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శారదానగర్‌లో శనివారం సాయంత్రం నెమలి ఎగరలేక కింద పడింది. అది గమనించిన శారదానగర్‌కు చెందిన షేక్ షెక్షావలి ఆ నెమలిని పట్టుకుని టూ టౌన్ పోలీసులకు అందించారు. అనంతరం ఏఎస్ఐ బాబయ్య ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అక్కులప్పకు నెమలిని అప్పగించారు. నెమలిని కాపాడిన షెక్షావలిని పోలీసులు అభినందించారు.